# వరకట్న నిషేధం

గుంటూరు

"పూజ్యులైన మామగారికి,

నేను కులాసాగానే చేరినాను. నా మిత్రుడు రామం నాకొరకు మంచి గది వెతికి వుంచినాడు. మంచిరోజు చూసి అందులో ప్రవేశించాను. నిన్న సాయంత్రమే వర్జ్యంలేకుండా కనిపెట్టి కాలేజీ ఫీసు కట్టినాను. ఇపుడే మీల్సు బుక్ తీసుకొన్నాను. సాయంకాలం టిఫిన్ బుక్ కూడా తీసుకుంటాను. ఎందుకంటే ఎపుడైనా చేతిలో డబ్బులేక ఇబ్బందిగా ఉండొచ్చు. అపుడు కాఫీకి చిల్లరవుండదు. అదీగాక రోజుకు ఆరేడుసార్లు కాఫీ త్రాగే అలవాటు నాకున్న సంగతి మీకు తెలిసినదే. అందు మూలాన, ఈ ఇబ్బందులు ముందే గ్రహించి టిఫిన్ టిక్కెట్లుకూడా కొనేస్తే మంచిదనుకుంటున్నాను. ఇహపోతే చిల్లర ఖర్చులు అవీ వుంటాయి. అందుకుగాను నాదగ్గర ముప్ఫయి రూపాయలు వున్నవి. ఈ నెలంతా గడుపుకుంటాను.

నేను తీసుకున్న గది కూడా బాగానే వుంది. ప్రస్తుతము నేను ఒంటరిగానే ఉంటున్నాను. రామంకూడా కొద్దిరోజుల్లో నాగదిలోనే చేరదామనుకుంటున్నాడు. మర్చిపోయాను ఇంటి వారికి ఇపుడే ఇరవై రూపాయలు ఇచ్చేశాను. ఇంటియజమాని చాలా పెద్దమనిషి. ఆయనకు ఏడుగురు ఆడపిల్లలని, ఏమేమో చెప్పేడు. రామం అందుకుని మావాడు గృహస్థు యోగ్యుడండీ అని హాస్యంగా అన్నాడు. ఇపుడు ఆయన తన సంసారగోడు నాముందు చెప్పుకోవడం కూడా మానేశాడు పాపం!

గుంటూరులో అమిత ఖర్చు. 'కాస్ట్ ఆఫ్ లివింగ్' చాలా 'హై'గా వుంది. కడితే ఖర్చు అయినా జాగ్రత్తగానే వాడుతున్నాను. దుబారా చెయ్యడం లేదు.

మీరు ఖులాసాగా వున్నారని తలుస్తాను. అత్తయ్యగార్కి నా నమస్కారములు తెలిపేది. మీ అమ్మాయి కులాసా అనుకుంటాను. నమస్కారములు. ఇట్లు,

మీ అల్లుడు."

* * *

గుడివాడ

"ప్రియమైన ఆనందరావుకు

మీ మామగారు దీవిస్తూ వ్రాయునది

నీవు వ్రాసినకవరు చేరినది. సంగతులు గ్రహించినాను. నేను ఇచ్చిన పైకాన్ని ఎక్కౌంటు చెప్పావు. సంతోషం. కానీ ఇకముందు అలా వ్రాయకు. నీవు నాకు లెక్క చూపించనక్కరలేదు. నేను ఎప్పుడూ అలా అడగను. నువ్వు చిన్నవాడివి కాదు కదా! నువ్వు దుబారా ఎందుకు చేస్తావు! పొరబాటునకూడా అలా చేయవు. నీకు కావలసిన పైకం వ్రాస్తే వెంటనే మనియార్డరు చేస్తాను. డబ్బువిషయంలో మొహమాటం పడకు. ఏక్షణంలోనైనా పంపించటానికి నేను సిద్ధముగా వున్నాను. అవసరం కలిగినపుడల్లా వెంటనే వ్రాయి. పైకం విషయంలో నీవు లోటు చెయ్యకు. ఈ నెలలో నీదగ్గరవున్న ముప్ఫయి రూపాయలు ఏమి చాలుతుంది? బలేవాడివోయి! ఇదంతా చూస్తూంటే నువ్వు బిడియపడుతున్నట్టున్నావు. దూరానవుండి అలా ఎప్పుడూ

## కొంపల్లి బ్రహ్మానందరావు

చెయ్యకు. ఇబ్బంది పడిపోతావు. అవసరమైన మొత్తానికి కొస్త ఎక్కువే తెలుపు. పంపిస్తాను. ఇపుడు మరో ఏభయి పంపిస్తాను. వాడుకో. మనకు తెలీని ఖర్చులు బోలెడు తగుల్తూంటాయి. మార్జినులో ఎపుడూ వుండకు ప్రమాదం!

మీ అత్తగారూ, పిల్లలూ కులాసాగానే వున్నారు. నీ క్షేమ సమాచారాలు తెలుపుతూ వుండు. ఆరోగ్య విషయం చాలా జాగ్రత్తసుమా. అసలే గుంటూరు మలేరియాకు ప్రసిద్ధి. కనిపెట్టివుండు.

అమ్మాయి శకుంతల కులాసాగానే వుంది. నమస్కారములు తెలుపమని నన్ను వ్రాయమన్నది. ఇంతే సంగతులు. ఇట్లు,

రామయ్య పంతులు"

* * *

గుంటూరు

"పూజ్యులైన మామగారికి,

నమస్కారములు. మీరు వ్రాసినజవాబు రెండురోజులక్రితం అందినది. కాలేజీ గొడవల్లోపడి తీరిక కావందున వెంటనే జవాబివ్వటానికి వీలు చిక్కలేదు. అందుకు మీరు మరోక విధముగా తలంచరని భావిస్తాను.

మీకు వ్రాసిన వుత్తరములో ఎక్కౌంటు అనుకుని చెప్పలేదు. జనరల్ గా నేను పెట్టిన ఖర్చును తెల్పాను. అయినా అక్కౌంటు మెయిన్టైన్ చేస్తే మంచిది కదా. నాకు పైకం కావాల్సినపుడు మొహమాటం లేకుండా అడగమన్నారు. థాంక్సు. ఈ నగరపట్టణములో ఎటుచూసినా అమితమైన ఖర్చు. ఎపుడైనా సినిమాకు పోదామనుకుంటే కనీసము రెండు రూపాయలవుతోంది. నీళ్ళు పోసి గది ఊడ్చే కుర్రాడు నెలకు అయిదు రూపాయలు తీసుకుంటున్నాడు. ఇహ చాకలి, మంగలి ఖర్చు చెప్పనక్కర్లేదు. ఇంతకీ నా వుద్దేశ ఏమిటంటే మనం అనుకున్నదానికన్నా కొస్త ఎక్కువ ఖర్చు అవుతుంది ఈ గుంటూరులో.

మీరు పంపిన ఏభయి చేరినయ్. చాలా సంతోషం. మొన్న వ్రాసిన వుత్తరములో నే వ్రాద్దామనుకున్నాను. కానీ మర్చిపోయాను. కొత్తగా చేరడం కనుక, ఈ ఏడాది క్రొత్త పుస్తకాలు చాలా కొనాల్సి వుంది. ఒక్కొక్క పుస్తకము కనీసం పదిహేను, ఇరవయి వరకూ వుంది. మొన్న రామం కొనుక్కొస్తే చూశాను—ఇరవయి మూడున్నర అయింది. ఇలాంటివి చాలా వున్నయ్. అందుకుగాను వెంటనే రెండు వందలు పంపాల్సి వుంటుంది. మరేమి అనుకోక పంపిస్తారని ఆశిస్తాను. ఇచ్చిన శ్రమకు క్షమాపణ.

అత్తగారూ, బావమరదీ క్షేమం అనుకుంటాను. మీ అమ్మాయి కులాసా తెలుపకోర్తాను. నేను క్షేమంగానే వున్నాను. శకుంతల ఆరోగ్యం వెంటనే తెలిపేది. ఇంతే సంగతులు. ఇట్లు,

మీ అల్లుడు."

* * *


నాణ్యతకు ప్రసిద్ధి చెందినవి!

ఎస్. ఆర్. మిషిన్ ఇంగుక్, కర్పూరపు బిళ్లలు, స్పెషల్ ఉత్పాదువస్తువులు.

బాలకృష్ణా ఇండస్ట్రియల్ వర్క్సు

మద్రాసు 13.

సేల్సు ఆఫీసు:

37, స్టారిటన్ ముత్తయ్యముదలివీధి, మద్రాసు-1

# ★ వరకట్న నిషేధం ★

గుడివాడ

"ప్రియమైన ఆనందరావును
దీవిస్తూ మీ మామగారు వ్రాయునది.

నీ క్షేమము తెలిపినందుకు చాలా సంతోషము. నీ ఇతర(త్రా) ఖర్చు చాలా వున్నట్టు వ్రాశావు! అవును మరి. పదిమంది వున్నచోటే ఖర్చు. వ్యాపారం కూడా బాగా జరుగుతుంది కాబట్టి ధరలు కూడ జాస్తిగా వుంటాయి. అందుకు నువ్వేమీ బాధపడకు. అడిగినంతా పంపిస్తాను.

నీవు అడిగిన రెండొందలూ ఇపుడే మనియార్డరు చేస్తున్నాను ఇక్కడ అమ్మాయీ, అందరూ క్షేమం. నీ క్షేమ సమాచారాలు తిరుగు టపాలో తెలిపేది. ఇట్లు,

రామయ్య పంతులు."

* * *

గుంటూరు

"పూజ్యులు మామగారికి.

మీరు వ్రాసిన ఇన్‌లాండ్ కవరు అందినది. వెంటనే పోస్టు జవాను మనియార్డరు కూడా ఇచ్చాడు. పోస్టాఫీసునుంచి పరాపరి బుక్‌షాప్‌కి వెళ్ళినాను కావలసిన పుస్తకాలను పర్ ఛేజ్ చేశాను. మొత్తం మూడొందలు అయింది. అందుకని వున్నంత వరకూ ఇచ్చి మిగతాది క్రెడిట్ వ్రాసుకోమన్నాను. షాపువాడు తెలిసినవాడే. అందుకని ఒప్పుకున్నాడు.
అత్తగారికి నా నమస్కారములు. శకుంతల క్షేమంగదా? నేను కులాసా. ఇంతే సంగతులు. ఆనందరావ్.

* * *

గుడివాడ

"అల్లుడు ఆనందరావును దీవిస్తూ,

నీ పోస్టుకార్డు అందినది. మూడొందలు పుస్తకాలకు అయినట్టు వ్రాశావు. మంచిదే. కానీ బేరంచేసి కొను. కొంచెం తక్కువ ధరలోనె గిట్టొచ్చు. నీకు వంద పంపుతున్నాను. షాపులో అప్పు తీర్చివేసెయ్. మంచిది. రామయ్య"

* * *

వైటోడెంట్
దంతక్రిములను
సంహరించే పండ్లపొడి
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్. మద్రాసు-30.

గుంటూరు

"మామగారికి అల్లుడు ఆనందరావు
నమస్కరిస్తూ,

నేను క్షేమం. మీరు పంపిన వందరూపాయలూ, కార్డూ అందినవి.

ఈ మారు మరికొంత ఖర్చు తగులుతుందని వ్రాయటానికి చింతిస్తున్నాను. మా యూనియన్ ఎన్నికలు దగ్గరకు వస్తున్నయ్. మా స్నేహితులు అందరూ నన్ను కంటెస్టు చెయ్యమని ప్రోద్బలం జేస్తున్నారు. అందుచేత బలవంతాన ఒప్పుకోవలసి వచ్చింది. ఆ సందర్భములో పబ్లిసిటీఖర్చు బోలెడు అవుతుంది. మరొక విధంగా అనుకోక, వెంటనే రెండొందలు పంప కోర్తాను. అందరూ క్షేమముగదా! నేను కులాసా. అల్లుడు."

* * *

గుడివాడ.

"అల్లుడు చూసుకునేది,

విద్యార్థి జీవితంలో ఈ రాజకీయాలూ, ఈ ఎన్నికలూ అనవసరమేమో అనుకుంటాను. మళ్ళీ ఆలోచించి పోటీ చెయ్యి. అదీగాక అనవసరపు ఖర్చుకూడా అవుతుందనుకుంటాను. అయినా వందా పంపిస్తున్నాను. ఆలోచించి కార్యంలోకి దిగు. అందరూ క్షేమము. నీ క్షేమం తెలిపేది. రామయ్య."

* * *

గుంటూరు

పూజ్యులైన మామగారికి వ్రాయునది.

మీ లేఖ అందినది. మీ సలహాను పాటించి ఎన్నికల్లో పోటీచేయడం మానుకుందామని నిశ్చయానికి రాగానే మా లెక్చరర్లు కూడ నన్ను ప్రోద్బలించి నా దృఢసంకల్పాన్ని మానిపించారు. అందుచే నా నిశ్చయానికి తిలోదకాలు ఇచ్చాను.

మా కాలేజీలో ఎన్నికలతీరు ఒక విధం. జనరల్ ఎన్నికల మాదిరి జరుగుతుంది. దాదాపు మూడు వేలమంది ఓటర్లు వుంటారేమో కాలేజీఅంతా కోలాహలము గానూ, కన్నులపండుగగానూ వుంటుంది. నేను జయము పొందాలంటే కనీసం నాల్గయిదువందలు పూర్తవుతుందని అంచనా వేశారు. గెలిచిన పిమ్మట నాభావిజీవితం చాలా మారుతుంది. పదిమందిలో పలుకుబడి లభిస్తుంది. పెద్దవారితో పరిచయం కాగలదు. మిగతా కాలేజీలతో సంబంధం ఏర్పడి పేరువస్తుంది. కాలేజీ యూనియన్ పనులన్నీ నా చేతిమీదుగా జరుగుతాయి. అందుకని కడసారిగా ఆలోచించి పోటీకి దిగాను. అందుకు అయ్యేఖర్చు భరించటానికి మీరు వెనుదీయరనుకుంటాను. వస్తాను. "బి. ఎస్. గెలిచినతర్వాత నాకు ఎక్కువ ఖర్చు వుండదు. ఎంతఖర్చయినా ఇపుడే."

మీ అల్లుడు"

* * *

గుడివాడ

"అలుడు చూచుకునేది,

డబ్బు కొస్త జాగ్రత్తగా వాడుతూ వుండాలి నాయనా! స్వంతసొమ్ములా గా చూచుకోవాలి. మరి పంపిస్తున్నాను గదా అని ప్రతిజాబులోను అలా అడగడం మంచిదికాదేమో! నీ క్కావలసిన అయిదొందలు పంపిస్తున్నాను.

రామయ్యపంతులు

* * *

"మామగార్కి,

మీరు పంపిన అయిదొందలు ఖర్చు చేశాను. ప్రతిఫలముగా యూనియన్ అధ్యక్షపదవికి నేనే ఎన్నికైనాను. సంతోషముకదూ!

గెలిచినతర్వాత ఖర్చుండదనుకున్నాను. కానీ డొనేషన్సుకీ, పార్టీఫండుకీ, చాలా లెక్క అవుతోంది. కనుక, వెంటనే మరో అయిదొందలు పంపక తప్పదు. అర్జంటు.'

మీ అల్లుడు."

* * *

గుడివాడ

"అల్లుడికి,

ఉత్తరం వస్తుందంటే భయపడి పోతున్నాను. దాని దుంపతెగ! ప్రతిసారీ డబ్బు పంపించమనేనా! చేరిన ప్రథమంలోనే ఇంతఖర్చు చేస్తుంటే రెండేళ్ళు ఎలా భరించగలననుకుంటావోయి! చూస్తే, నీకు కట్నమే ఇచ్చుకున్నట్టయితే మెరుగ్గా వుండేదేమో! ప్రాణం హాయిగానూ వుండేది కట్నం లేకుండా పిల్లని చేసుకుంటున్నావుగదా అనుకున్నాను. కట్నంకన్న మించి గుంజేశావు నా దగ్గర. ఇహ నీకు నేను దమ్మిడీ పంపలేను. నా శక్తి కరిగిపోయింది. నీవు అడిగిన కట్నం నీకు వచ్చేసింది కనుక, నీ చదువు విషయం ఇహ నాకు బాధ్యతలేదు. మరేమీ అనుకోకుసుమా! అమ్మాయి, పిల్లలూ కులాసా. వస్తాను. రామయ్యపంతులు."★

మంచీ - చెడూ
వెల 2-0-0
పోసుఖర్చు ప్రత్యేకం
ఆంధ్రగ్రంథమాల,
మద్రాసు–1.